# వారే కీలకం అదే ప్రచార అస్త్రం

శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న డ్వాక్రా మహిళలు



**నగదు రహిత లావాదేవీలన్నీ ఇక విద్యార్థులు, మహిళల చుట్టూనే జరగనున్నాయి. ఇదేంటి అనుకుంటున్నారా?**

**అవును ఇది వాస్తవం. నగదు రహిత లావాదేవీలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం విద్యార్థులు , మహిళలను ప్రచార అస్త్రంగా చేసుకుంది. వారి ద్వారే మార్పు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు మొదలు పెట్టింది.**



గ్రామీణులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు



- నగదు రహిత లావాదేవీలకు ప్రభుత్వ వ్యూహం
- విద్యార్థులూ, మహిళలే లక్ష్యంగా ముందుకు
- గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలతో చైతన్యం
- ప్రచారకర్తలకు ప్రోత్సాహకాలు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే

సమాజానికి మేలు కలిగే ఎటువంటి మార్పయినా యువత, మహిళ ద్వారా సాధ్యమనేది ప్రభుత్వం గుర్తించింది. అందుకు ఈ రెండు వర్గాలను లక్ష్యంగా చేసుకొని నగదు రహిత కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు చర్యలు ప్రారంభించింది. సీఎం చంద్రబాబు ప్రవేశ పెట్టిన డ్వాక్రా సంఘాలు ద్వారే నగదు రహిత కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు సన్నాహాలు ప్రారంభించారు. విద్యా సంస్థల్లో విద్యార్థులు ముందుగా వీటిపై పూర్తి స్థాయి అవగాహన పెంచుకొని వారు ఆచరిస్తూ చుట్టూ ఉన్నవారిని ఆచరించేలా చేసేందుకు వారిని ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేశారు.

## మహిళలతో ఇలా..

గ్రామీణ మహిళల్లో 95 శాతం మంది పొదపు సంఘాల్లో ఉన్నారు. ముందుగా వీరికి నగదు రహిత లావాదేవీలపై అవగాహన కల్పించి వీరు డిజిటల్ విధానానికి అలవాటు పడేలా ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వం పెట్టుబడి నిధిగా జమ చేసిన రూ.30 వేలను సభ్యులు తీసుకోకుండా నేరుగా సంఘం ఖాతా నుంచి వ్యక్తిగత ఖాతాలో జమయ్యేలా చేశారు. ఇవి మొబైల్ బ్యాంకింగ్ ద్వారా వినియోగించుకునేలా తర్ఫీదు ఇస్తున్నారు.

### ఇదీ ప్రోత్సాహం

ఇలా ఒక గ్రామంలో ఒక సీఎఫ్ 200 మందికి మహిళలు , 20 మంది చిరు వ్యాపారులకు అవగాహన కల్పించాలని లక్ష్యం విధించారు. వీరు ఒక మహిళతో ఒక అంతర్జాల చెల్లింపు చేయిస్తే రూ.10 ప్రోత్సాహం అందనుంది.

### లక్ష్యం 5 లక్షల మంది

దీనిలో భాగంగా తొలిత స్థానిక సాంకేతిశిక్షణాభివృద్ధి కేంద్రంలో జిల్లా, మండల , గ్రామ సంఘాల అకౌంటెంట్లు, కార్యవర్గ సభ్యులు , సీఎఫ్, సీసీ, ఏపీఎంలకు అవగాహన కల్పించేందుకు ఒక్క రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెండో దశలో వీరంతా 38 మండలాల్లోని 45 వేల డ్వాక్రా సంఘాల్లోని 5,34,000 మందికి అవగాహన కల్పించనున్నారు.

## ఇవిగో ఆదేశాలు

కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ ఇప్పటికే ఉన్నత విద్యాలయాలకు మార్గదర్శకాలు జారీ చేసింది. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ డ్వాక్రా సంఘాల మహిళలకు కార్యాచరణ ఇచ్చింది. ముందుగా బ్యాంకు , ఆర్థిక శాఖ అధికారులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి సరైన శిక్షణ ఇవ్వడమే కాకుండా కేంద్రం విడుదల చేసిన కొన్ని వీడియోలను చూపిస్తున్నారు.

## ప్రత్యేక శిక్షణ..

దాదాపు 99 శాతం మంది సంఘాల్లోని మహిళలకు బ్యాంకు ఖాతాలు ఉన్నాయి. వీటికి రూపే కార్డులు జారీ చేస్తున్నారు. వీటిని ఉపయోగించి సరకులు, సినిమా టికెట్లు, పలు రకాల బిల్లుల చెల్లింపునకు ఉపయోగించేలా ప్రభుత్వం కొత్తగా రూపొందించిన ఏపీ పర్స్ యాప్‌తో పాటు ఇతర యాప్‌లను సెల్ ఫోన్ ద్వారా వినియోగంచుకునేలా అవగాహన కల్పించే చర్యలు తీసుకుంటున్నారు.



## పెద్దఎత్తున చేపట్టేందుకు చర్యలు



నగదు రహిత లావాదేవీలపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులను భాగస్వామ్యం చేస్తున్నాం. ఇప్పటికే విద్యార్థులతో అంతర్జాలంలో వివరాలు నమోదు చేశాం. మరికొందరితో దత్తత తీసుకున్న గ్రామాల్లో పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నాం.

**-ఎస్.తారకేశ్వరరావు, నోడల్ అధికారి, అంబేడ్కర్ విశ్వవిద్యాలయం**

## మార్పు వస్తుంది



తొలి దశలో సీఎఫ్‌లు , సీసీలకు శిక్షణ ఇచ్చాం. వీరికి ట్యాబ్‌లు ఉన్నందున గ్రామాల్లో తిరిగి అవగాహన కల్పించనున్నాం. దీనివల్ల మహిళల్లోనూ మార్పు వస్తుంది.

**- కిషోర్‌కుమార్, పీడీ, డీఆర్‌డీఏ**



అంబేడ్కర్ వర్సిటీలోని విద్యార్థులు వివరాలు నమోదు చేస్తున్న విద్యార్థులు

## విద్యార్థులతో..

విశ్వవిద్యాలయాలు, ఇంజినీరింగ్, పీజీ, డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల ద్వారా ప్రచారం చేయించేందుకు ముందుగా ఆసక్తి ఉన్న విద్యార్థులను గుర్తించాలని తెలిపింది. అటువంటి వారి వివరాలను అంతర్జాలంలో నమోదు చేయిస్తుంది. దీంతోపాటు కొన్ని గ్రామాలను దత్తత తీసుకొని ఆ గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి, స్వైపింగ్ యంత్రాలతో లావాదేవీలు నిర్వహించే చర్యలు తీసుకుంటున్నారు.

## ప్రత్యేకాధికారితో..

దీనిలో భాగంగా ఈ నెల 20 వరకూ విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి శిక్షణ ఇస్తున్నారు. వ్యాసరచన , వక్తృత్వ పోటీలు నిర్వహించడమే కాకుండా సీడీలను ప్రదర్శించి అవగాహన కల్పిస్తున్నారు. అందుకు స్థానిక అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఒక బోధన సిబ్బందిని కార్యక్రమం అమలుకు నోడల్ అధికారిగా నియమించారు. ఆయనతో వర్సిటీ దాని అనుబంధ కళాశాలల్లో కార్యక్రమ అమలుతీరును పర్యవేక్షించే చర్యలు తీసుకుంటున్నారు. వర్సిటీలో ఇప్పటికే 250 మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోగ, అనుబంధ డిగ్రీ కళాశాలల్లో వెయ్యి మందికి పైగా నమోదు చేసుకున్నారు. వీరంతా ఈ నెల 21 నుంచి గ్రామాల్లో తిరిగి ప్రచారం మొదలుపెట్టనున్నారు.

### ఇదీ ప్రోత్సాహం

విద్యార్థులు గ్రామాల్లో అవగాహన కల్పించి ఒక వ్యక్తిచే ఐదు చెల్లింపులు చేయిస్తే ప్రభుత్వం రూ.115 ఇవ్వనుంది.